# పువ్వుల కొరడా

తుమ్మపాలెం ఊరు అంత పెద్దదీ కాదు- అలాగని చిన్నదీకాదు. మధ్యస్తంగా వుంటుంది. దాదాపు మూడు వందల ఏభై ఇళ్లుంటాయి ఆ ఊరిలో ! అందులో చాలా తక్కువ సంఖ్యలో కొన్ని జాతులవారున్నారు. అందులో ఆరేడు కుటుంబాల వారే వున్నారు చాకళ్లు ! ఈ ఆరేడు కుటుంబాల చాకలివారే ఆ ఊరి మురికి బట్టలు వుతికి బాగుచేస్తుంటారు. ఇలా బాగుచేస్తున్నందుకు ఏడాదికి యిన్ని అని చెప్తూ ధాన్యం లెక్కగట్టి ఆ ఊరి ఆయా కుటుంబాలవారు యిస్తుంటారు. ఆరేడు కుటుంబాల వాళ్లే- మూడు వందలేభయి ఇళ్ల మురికి బట్టలు ఉతకడం వలన అహర్నిశలూ తీరిక లేకుండా పనిజేస్తుంటారు. అయినా, వీళ్ల బతుకులకు 'గడియతీరదు- గవ్వ మిగలదు' అనే సామెత సరిపోతుంది !

గవ్వ మిగలని చాకలోల్లలో అసిరిసెట్టి ఒకడు. అసిరిసెట్టి ఈమధ్య అంటే మొన్ననే తన చిన్న కూతురికి పెళ్లి చేసాడు. సరిగ్గా ఈ పెళ్లి రోజునే తుమ్మపాలెం నాయుడు గారి కూతురుకి బంగారంపేట ప్రెసిడెంటు గారి అబ్బాయిని యిచ్చి పెళ్లి చేసారు.

అసిరిసెట్టి కూతుర్ని తన చెల్లెలు కొడుక్కిచ్చి పెళ్లి చేసాడనీ, బంగారంపేట ప్రెసిడెంటుగారబ్బాయిని తుమ్మపాలెం నాయుడుగారి కూతురు కిచ్చి పెళ్లి చేసారనీ అనడంలో తేడా ఏమంటే-

అసిరిసెట్టి కూతురు పెళ్లికి అల్లుడే ఖర్చులన్నీ భరించాడు.

నాయుడుగారి కూతురు పెళ్లికి, పెళ్లిఖర్చులేకాక, పెళ్లికి కావలసిన సరుకులు కొన్నట్టే ప్రెసిడెంటు గారబ్బాయిని అరవై వేలిచ్చి కొని, తీసుకొచ్చి పెళ్లిచేసారు నాయుడు గారు. అదీ తేడా !

పెళ్లికి ఖర్చూ, కరమ్మత్తూ తగలని అసిరిసెట్టికి ! కూతురు అత్తారింటికి పయనమవుతుంటే ఏడుపొచ్చింది. ఏడుపొచ్చిన అసిరిసెట్టికి నాయుడింటి నుండి కబురొచ్చింది. కూతుర్ని పయనం చేయించేసి, అసిరిసెట్టి నాయుడు బాబు ఇంటికి వెళ్లాడు.

నాయుడు గారిల్లు ఇంకా పెళ్లికళతోనే వుంది. ఇంటి ముందు పెద్ద పెళ్లి పందిరీ, దాని కింద మంచాలూ చల్లని నీడలో కూర్చున్న సింహాల్లా వున్నాయి. అరవై వేల రూపాయలు దాటి ఖర్చయిపోయినా అరగని రోడ్డురోలర్‌లావున్న నాయుడుగారు ఆ పందిరి నీడలోని సింహాల్లాంటి మంచాల్లో అన్నిటికంటే పెద్దదైన పందిరికోళ్ల మంచమ్మీద కూర్చొని పడుకొన్నారనొచ్చు ఆయన్ని చూసినవారు !

నాయుడుగార్ని చూసిన అసిరిసెట్టి, పందిరికోళ్లనీ, మంచాల్నీచూసి గతుక్కుమని; ఆ మంచానికి దూరంగా, ఒక వోరగా నిలబడ్డాడు. నిలబడిన అసిరిసెట్టిని చూసి, నాయుడుగారు-

"ఏఁవిరా ? ఇంకా పెళ్లి అడావిడి తీరలేదేట్రా నీకు ? అలికిడే లేదిటు కాసి. ఇదేటి పెళ్లి ఇళ్లు అనుకున్నావా, లేదా ? లేక పోతే, నీ కూతురు పెళ్లే ముక్యం అయిపోయిందా ఏటి ?" అన్నారు.

"నేదు బాబో, నానే వొద్దు మనుకుంతన్నాను. ఇంతలోకి మీరే కవురెట్టినారు..."

"కవురెట్ట పోతే నువ్వొత్తావేటిరా ? ఏసయి కాలం ! ఎండ ఏడెక్కి పోతావు గాదా, గడప దాటవు నువ్వందుకే...."

"అదేటిబావో, అలగంతారు. ఎండేటి, వోనేటి మాకు."

ఇంతలో పెళ్లికూతురు నాయుడుగారి చెవిలో యేదో చెప్పడానికి వొచ్చింది. పాలపిట్ట రంగు, బంగారం అంచుతో పట్టుచీర మెరుస్తోంది. మెరుస్తున్న చీరలో, మెరవని పెళ్లికూతుర్ని మెరిపిస్తున్నాయి నగలూ, అలంకారాలూ !

అసిరిసెట్టి చూసాడు. పెళ్లి కూతురంటే యిలా వుంటాది గావాల అనుకున్నాడు. పెళ్లి కూతురైన తన కూతుర్ని తల్చుకున్నాడు. ఆమెకీ-ఈమెకీ పోల్చుకుంటున్నాడు. ఎత్తయిన భవంతిలో విహరించే రాణిలాగ నాయుడుగారి కూతురు కన్పిస్తే, ఆ భవంతి ప్రక్కనున్న పూరి గుడిసెలో నివసించే దాసీ దానిలా తన కూతురు కన్పించింది ! ఇక మరి ఆలోచించ లేక పోయాడు.

పెళ్లి కూతురు కూడా వెళ్లిపోయింది. తర్వాత నాయుడుగారు కూడా మంచం మీద నుండి లేచారు.

"రా...రా...సెట్టోడా ! ఇంట్లోని గొడ్డలి దీసికెల్లి, కల్లంలోన ఎండు దుక్కలున్నాయి. అవి ముక్కలుజేసి, పేళ్లు గొట్టీరా..." అని పిలిచి, గొడ్డలి ఇంట్లో ఎక్కడుందో చెప్పేసి లోనకి వెళ్లిపోయారు.

కల్లంలోకెల్లి, దుక్కల్ని ముక్కలుజేసి, చెక్కపేళ్లన్నీ ఏరుకొని మోపుగట్టి వంటింట్లో పడేసి, తువ్వాలు గుడ్డతో మొహంమీది చెమట తుడుచుకుంటున్న అసిరిసెట్టినిచూసి, సేమ్యాపాయసం రుచి చూస్తున్న నాయురాలమ్మగారు—

"ఓరె, సెట్టోడా ! మధ్యాన్నం బేగి రమ్మిరా. వొంటయిపోతాయి. వీరవ్వవారింటికి యేనాలుకావిడొట్టు కెల్టువు గాని రమ్మిరో" అని ఆర్డరేసింది.

ఆ ఆర్డరు వినగానే అసిరిసెట్టి తన పనయిపోయిందిర, బాబో అనుకున్నాడు. ఎండలు మండిపోతన్నాయి. ఇంత ఎండలోన కావిడి బరువుతోటి, ఏడెనిమిది మైళ్లు దోవ వుంటుందావూరు, ఎల్లిరావడ మంటే మాటలా? దేవుడ్ని తల్చుకున్నాడు.

"సాకలోడికి ఎందుకు పుట్టించావుర దేవుడా ? అంతేలే, నీనేమి

పాపం జేసానో యీ జన్మెత్తాను. ఈ జన్మెత్తినందుకు ఈ కావిడి ఎత్తక తప్పదు గావాల!” అనుకున్నాడు. ఇలా ఆలోచిస్తూ ఇంటికొచ్చాడు.

ఇల్లంతా బోసిపోయివుంది. ఒంటరివాడయినాడిపుడు అసిరిసెట్టి! పెద్దకూతురి పెళ్లిచేసేసిన తర్వాత, రెండేళ్ల కిందట అసిరిసెట్టి పెళ్లం పోయింది. బట్టలమూట మోసుకుంటూ వీధిలో వస్తుంటే నాయుడుగారి పెద్దకోడెద్దు రంకె లేసుకొస్తోంది. ఎద్దు కొమ్ముతో కడుపులో పొడిసి పేగులు లాగేసింది. గావుమని అరిసి చచ్చిపోయింది అసిరిసెట్టిపెళ్లం. చచ్చిపోయిన సెట్టిదాన్నిచూసి యేడవకుండా వుండలేక పోయాడు అసిరిసెట్టి ఏడుస్తున్న యిద్దరాడకూతుళ్లనీ ఓదార్చలేకపోయాడు !

ఏడుస్తున్న ముగ్గుర్నీ ఊరుకోమన్నారు నాయుడుగారు. సెట్టిదాన్ని ఖననం చేయించేసారు గుట్టు చప్పుడుగా !

దినకార్యాలయాక పెద్ద కూతురు అత్తవారింటికి వెలిపోయింది. ఉన్నచిన్న కూతురుతో ఇన్నాళ్లూ బతుకుతూ, బట్టలుతుకుతూ గడుపు కొచ్చాడు. ఇకనుండి ఒంటరే! ఎలా బతకడం ? బట్టలుతికితే వొంట వొండలేడు. వొండితే బట్టలుతకలేడు. గనక, అసిరిసెట్టికి నాయుడుగారి పెద్దకోడెద్దు మళ్లీ రంకెలేస్తే బాగుండుననీ, సెట్టిదాన్లాగే తనూ ఆ ఎద్దు రంకెలికి బలయిపోతే బాగుణ్ణనీ అన్పిస్తోంది.

అవునంతే గదా! తెల్లారిలేచిన దగ్గర్నించీ రాత్రి పడుకొనేవేళదాక, బదవ తప్పకపోతే యిక బతికెందుకు ?

ఇలా బతుకెందుకని అనుకుంటున్నఅసిరిసెట్టికి చావుకూడా ఎందుకో తెలీదు. చావూ, బతుకుల పరమార్థం తెలీని అసిరిసెట్టికి అయిదేళ్ల కొకసారొచ్చే ఎలక్షన్లంటే పండగనీ, ఆ పండగల్లో పెద్దలు తమ దగ్గరకు వస్తారనీ, సారా పోస్తారనీ, నోట్లిస్తారనీ తెలుసు అయిదేళ్లపండగంటే యింతే తెలుసుతప్పా, ఆ పండగ తర్వాత ఆసదరు పెద్దలు ఏంచేస్తున్నారో ఆ పండగల రహస్యాలేమిటో అసిరిసెట్టికి తెలీదు. ఎలక్షనంటే తెలీని

అసిరిసెట్టికి ప్రజాస్వామ్యమూ సోషలిజమూ అర్థం కాదు. ఇవేవీ అర్థం కాని అసిరిసెట్టికి స్వాతంత్ర్యమంటే యేమిటో గూడా తెలీదనే అనుకోవాలి మనం !

స్వాతంత్ర్యమంటే తెలియని అసిరిసెట్టిని నాయుడుగారు సరిగ్గా మధ్యాహ్నం రెండుగంటలవేళ ప్రయాణం కట్టించారు—అరిసెల కావడి మీద చీర, సారెలుపెట్టి వారి వీరకాళ్ల ఇంటికి !

ఈ కావడిమోత తప్పడానికి తనకి జబ్బొచ్చినా బాగున్ను ! కాలిరిగి పోయినా బాగున్ను అనుకున్నాడు. పుట్టించినాడనుకుంటున్న దేవుడికి ఇలా దయతలచడం తెలీదు. అసిరిసెట్టికి జబ్బూరాలేదు కాలూ విరగలేదు. కాబట్టి కావిడిమోత తప్పలేదు!

కావిడిభుజమ్మీదేసుకొని సర్దుకుంటున్న అసిరిసెట్టిని—

"జాగర్తరో! తోవలోనెక్కడేనా పడీసీగలవు సామాన్లు. అరిసెలవీ లెక్కబెట్టి ఎట్టాను. తక్కువని అన్నారా నీకు తొక్కలాడి పోతాయిస్మీ" అని నాయురాలు హెచ్చరించారు.

"సర్లేమే. ఆడికి తెల్దేటి? సెట్టోడా! మా ఈరకాడికి యీ సాయంత్రం అల్లుడూ, కూతురూ ఎలిపోవొస్తారని సెప్పురా ! యేటి ?" అని నాయుడు నారంటే,

నాయురాలు "ఆలిద్దరేనేటి?" అని నాయుడిని ప్రశ్నించి, సెట్టోడితో

"ఒరే, అల్లిద్దర్తోటి మరో ఆరేడుగురు పేరంటాలు వొస్తారని సెప్పురా..." అంది !

ఇలా ఆఖరుసారిగా నాయుడూ, నాయురాలూ హెచ్చరికలూ, కబురులూ అయిపోయిన తర్వాత, అసిరిసెట్టి అరిసెలకావిడి ఎత్తుకొని భుజమ్మీద సర్దుకొని పయనమయ్యాడు !

కుమ్మాపాలెం ఊరునుంచి కుడిపైపుగా కొంతదూరాన నాగావళి నది పారుతోంది! దాన్ని దాటి ఆరేడుమైళ్లు నడిస్తే బంగారమ్మపేట ఊరొస్తాది!

ఈ మధ్యలో రెండుమూడు ఊళ్లు తగుల్తాయి. తోవలోనే గల యీ ఊళ్లలో ఒక ఊరిలో అసిరిసెట్టి పెద్దకూతురుంటున్నది !

ఎండలో కావడిమోత కష్టంగావున్నా,- పోనీలే తోవలో కూతు రింటికెల్లొచ్చు. చిన్నదాని పెళ్లికి గూడా రాలేదు ఎందుకోగానీ- అని అనుకుంటూ, పెద్ద కూతురు గూర్చి ఆలోచించుకుంటూ తోవలోని ఒక ఊరుదాటి పోయాడు అసిరిసెట్టి !

మధ్యలో కొంతమంది తెలిసినవారు కన్పించి-యేటి సెట్టోడా ? యింత ఎండల కావిడొట్టికెల్తన్నా వెక్కడికేటి ? - అని అడుగుతుంటే, ఆఁ...ఆఁ....మా నాయుడు బాబుగోరి వీరకాలింటికి...బంగారంపేట— అని బదులు చెప్తూ నడుస్తున్నాడు !

దార్లో పెద్దకూతురింటికి వెళ్లాలనుకున్నాడేగానీ, ఎళ్లిన తర్వాత, అక్కడ మనవలిద్దరూ చూస్తారు గావాల...తాత యేటి తెచ్చాడో అనీ ! తోవల ఏపేనా కొనుక్కొని తీసికెల్లాల ! కొనాలంటే జేబుల పైసాలేదు !

తోవల కర్సులుంటాయని జేబుకీ తెలీదు. పంపించిన బాబుకీ తెలీదు !

ఖాళీజేబుల అసిరిసెట్టి అరిసెలకావడితో ఎలాగైతేమి పెద్దకూతురి ఊరు చేరుకొన్నాడు. కూతురింటికెల్లాడు. తండ్రిని చూసిన కూతురు పొంగిపోయింది ఆనందంతో !

"ఇదేట్రా నాయినా, ఇంతెండల బయలెల్నావు? ఒక సిటంతాలనేక పోనావా ?" అంది, దాహానికి చెంబుతో నీళ్లిస్తూ.

"ఎంతెండయితే యేటిజేత్తామే కూతరా ? నాయుడోలికి ఎండనేదు కదా ! పందిరికింద పందిరికోళ్ల మంచమ్మీద సక్కగ తొంగుంతారు. మనల్ని ఎండల తోల్తారు. యేటి జేత్తాం...మరి ! ఎల్లపోతే తంతారు" అని చెప్తూ—

"ఔనుగానీ; సిన్నమ్మి పెళ్లికి నువ్వురాలేదేమమ్మీ?" అనిఅడిగాడు.

ఇంతలో అసిరిసెట్టి మనవలిద్దరూ వొచ్చారు. 'తాత్తాత' అని ఓ క్షణం గెంతులేసి, తాతమీద ఆడుకొని వెళ్ళిపోయారు.

"ఉండురయ్యా. టీ తెత్తాను. గంగరాజు కొట్టుకాడ" అని సెట్టోడు వొద్దన్నా, వినకుండా వెళ్ళింది కూతురు.

మాటల్లో పడిన అసిరిసెట్టి కావడి చూడ్డం మర్చిపోయాడు. తాత యేటీ తేలేదని గ్రహించిన పిల్లలిద్దరూ కావడి చేరుకున్నారు.

అసిరిసెట్టి కావిడి చూసాడు. గుండెలారిపోనాయి !

అసిరిసెట్టి పదిలంగా మోసుకొస్తున్న నాయుడుగారి ఆస్తిని ఎవరో దొంగలు దోచుకుతింటున్నట్లు తుళ్ళిపడ్డాడు !

ఇద్దరు పిల్లలూ కావిడి దగ్గిట కూర్చొని; చెరో రెండూ పంచదార అరిసెలు తింటున్నారు. నల్లగా, చీమిడు కారేముక్కుల్తో, దిసమొలల్తో వున్న ఆ పిల్లలు అరిసెల్ని ఆప్యాయంగా తింటూ పరిసరాల్నే మరచి పోయారు.

అసిరిసెట్టికి నోటమాటరాలేదు. నాయురాలి హెచ్చరిక వినిపించింది. గుండెలు దఢ,దడా కొట్టుకున్నాయి ! అమ్మో ! అయిపోద్ది నాపని—అను కున్నాడు.

ఇంతలో కూతురొచ్చింది టీ తో! అసిరిసెట్టి పిల్లల్ని సూపించాడు. తుళ్ళిపడ్డాది కూతురు !

"అమ్మో అమ్మో ! ఎదవగుంటలకానా ! ఎంతపని సేస్సార్రా ! అవేటి మనతిండికనుకున్నారేటి ?" అని అడిగింది.

అవి ఎవరి తిండికో, ఎవరి కోసమో అనే సంగతి పిల్లలకు ఎలా తెలుస్తుంది ? తెలీని పిల్లల్ని బాదేసింది—తండ్రి కేమవుతుందో అన్న భయంతో. పిల్లలు ఏడుపందుకున్నారు. అసిరిసెట్టి మనసులో సంజాయిషీ గురించి రిహార్సల్సు వేస్తున్నాడు. కూతురు పిల్లల్ని తిడ్తూ....కొడుతోంది. పిల్లలు ఏడుపు పెంచారు !

అప్పుడే రేడియో శ్రీలంక స్టేషన్ నుండి—'పిల్లలూ దేవుడూ చల్లనివారే ,కల్లకపట మెరుగనీ కరుణామయులే—' పాట వినిపిస్తోంది. పాట వినే నాధుడూ, కరుణించే మహనీయుడూ పిల్లలకీ, అసిరిసెట్టికీ కన్పించనే లేదు !

కూతురిచ్చిన టీ తాగేశాడు. ఏడుస్తున్న మనవళ్ళనొదిలేసాడు. కావిడి ఎత్తుకొని బయల్దేరాడు.

బంగారంపేట చేరుకొని, ప్రెసిడెంటు గారింటిముందు కావిడి దించాడు !

ప్రెసిడెంటు గారు వీరపువారి కావిడి సరంజామా అంతా ఇంటిలో భద్రపరిపించుకొని, అసిరిసెట్టికి ఖాలీ కావడి ఇచ్చేసారు. దాన్తోపాటుగాఒక రూపాయి గూడా ఇచ్చారు.

ఒక రూపాయి !

కావడి మోసిన అసిరిసెట్టికి ప్రెసిడెంటుగారు ఇచ్చారు !

దాన్ని కూలి అంటారా ?

బహు మాన మంటారా ?

దాన్ని రూపాయే అంటాము ముందు మనము !

అది కూలీకాదు, బహుమానంకాదు. భూస్వామ్య దర్పం విదిలించిన ఎంగిలి మెతుకు! ఫ్యూడల్ ప్రభువులు విసిరేసిన చిల్లరనాణెం !!

తరతరాలుగా గ్రామాల్లోని చాకలి, మంగలి, బారికలాంటివారు భూమిలేని కూలి రైతాంగం కంటే హీనస్థితిలో మగ్గుతూ, భూస్వాముల ఊడిగం చేస్తున్నారు. వారి కావిడి మోస్తున్నారు. సవారీ మోస్తున్నారు. కాళ్లు పడుతున్నారు. కర్రలు గొడుతున్నారు. అందుకు ప్రతిఫలం...యిదే రూపాయో, ఎంగిలి మెతుకో !

ఇచ్చిన రూపాయి పుచ్చుకొని, వారి వద్ద సెలవు దీసుకొని అసిరిసెట్టి తిరిగి ప్రయాణమయ్యాడు.

ప్రతీ కార్యక్రమం యొక్క ఫలాఫలాలు వెంటనో, తర్వాతనో తప్పకుండా వుంటాయి.

నాలుగు అరిసెలు లెక్క తెలియవులే అని, వేధించే మనసుని సరి పెట్టుకునేవాడు అసిరిసెట్టి.

పెళ్ళితంతులో, ఇచ్చిపుచ్చుకొనే సమయాల్లో లెక్కలు ఖచ్చితంగా వెల్లడవుతాయి. అవేమీ ప్రణాళికా లెఖ్ఖలు కావుగా! ఆ రకంగానే, నాలుగ రిసెలు తక్కువయ్యాయనే వెల్లడైంది. వీరపువారు నాలుగువేలు తక్క వలా వ్యాఖ్యానాలు ప్రారంభించారట!

నాయురాలికి తెలిసింది.

"ఎందుకు తక్కువాస్తాయి. ఎదవ! ఆ సాకలోడి పనే అది!" అని ఎగిరిపోయింది.

నాయుడిని పిలిపించమన్నది చాకలోడ్ని. పిలిపించి సెద్మాలాడ గొట్టమన్నది. చర్మం వొలిచి డప్పుగట్టమన్నది. డప్పుగట్టిసి వాయించ మన్నాది.

"లేకపోతే బాగోదు సూడండి వీరపోరు మనకి ఎలాగ వాయిం చేస్తున్నారో..." అని నాయుడిని వాయించేసింది!

రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదువా? నాయుడు తల్చుకున్నాడు. షువ్వుల కొరడా పట్టుకొన్నాడు. అంతే...

నరాలు జివ్వుమని తెగిపోతున్నాయి అసిరిసెట్టికి. వీపుమీదపడ్తోన్న కొరడా దెబ్బలకు చర్మం చిరిగిపోతోంది. శరీరం మంటపెడుతోంది! కంటి నుండి నీరు ధారాపాతంగా రాగా యేడుస్తున్నాడు అసిరిసెట్టి. ఒంటి నుండి...రక్తం...చర్మం తెగి కారుతోంది!

ఎర్రగా...కారుతోంది రక్తం!

షువ్వులకొరడా...ఎరుపయిపోతోంది!

నాయుడుగారి పందిరి కింద గచ్చుమీద ఎర్రటి నెత్తురు మరకలు

పడుతున్నాయి. రక్తం! ఎర్రటిరక్తం! సింధూరంలాంటి, తొలిసంధ్య లాంటిరక్తం! నరజాతి చరిత్ర పొడుగునా కారుతూ వచ్చిన రక్తం! అవును చరిత్ర నిండా రక్తమే! ఈ రక్తమే చరిత్రని మార్చింది!

నాయుడుగారి కాళ్ళమీద పడ్డాడు. నాయురాలికి దండం పెట్టాడు. జరిగిన పొరపాటంతా చెప్పాడు. ఈ పాలికి తప్పుగయిపుచ్చుకోండని బతిమాలాడు. శాంతించమని కోరాడు!

రక్తాల ధారలా, అమ్మోనాయినో అన్న అసిరిసెట్టి యేడుపూ, వేడుకోలూ యేవీ నాయుడ్ని శాంతింపచేయలేదు. మరింతగా తిడ్తూ, కొడ్తున్నాడు.

అసిరిసెట్టికి వీపు మండుతోంది. శరీరమంతా అగ్నిలా కాలిపోతోంది. కావిడివద్ద పిల్లలు నిర్భయంగా తింటున్న దృశ్యం కళ్ళముందు కదులాడింది! భయం, బెదురూలేని వారి రూపాలు, వారి అమాయక మోహాలు అసిరిసెట్టిలో కదలిక తెచ్చాయి!

అంతే, అసిరిసెట్టి కదిలాడు.

నిటారుగా, నిప్పులా లేచాడు. కొరడాకంటే వేగంగా, కత్తి కంటే పదునుగా, నాయుడుకంటే బలంగా లేచాడు!

పువ్వుల కొరడా అసిరిసెట్టి చేతిలో విరిగిపోయింది.